యం.ఐ. కిషన్

# రాజుగారి కుక్క

నోట్లోంచి చొంగ కారుస్తూ నాకేసి గుర్రుగా చూసిందా కుక్క.

ఆ చూపు చాలా అసహ్యంగా ఉంది.

చూపే కాదు, దాని మొహం కూడా ఎంతో వికారంగా ఉంది.

పోనీ రంగైనా బాగుందా అంటే అదీ లేదు. దాని రంగు కూడా చాలా అసహ్యంగా ఉంది. ఇటకపొడిలో తారు కలిపితే బహుశా ఆ రంగొస్తుందేమో!

అంత వికారమైన కుక్కని నేనెప్పుడూ చూడలేదు.

దాని పేరు జాకీ.

'ఏయ్ జాకీ' అని పిలవగానే గుర్రుచూపుని ప్రేమ చూపుగా మార్చి నాకేసి తోకూపుకుంటూ వచ్చింది.

ఆ తోక కూడా ఎంతో అసహ్యంగా ఉంది.

అది దాని ఛండాలమైన నాలుకతో నా కాళ్ళని నాకుతుంటే ఒళ్ళంతా కంపరమెత్తి పోయింది నాకు.

నా కాళ్ళని నరికేసుకోవాలన్నంతగా చీదర పుట్టింది.

అయినా సరే దాని వీపు మీద ఆప్యాయంగా నిమిరాను. నా చిన్నకొడుకు కిట్టు తలని ఎంత ఆప్యాయంగా నిమురుతానో అంత ఆప్యాయంగా నిమిరాను.


నిమురుతూ దానికేసి ప్రేమగా చూశాను.

నా చూపులోని ప్రేమని అది పసిగట్టినట్టుంది... ఎంతైనా కుక్క గదా? పసిగట్టడంలో దిట్ట కదా? అదీ నాకేసి ప్రేమగా చూసింది. మోర పైకెత్తి ఈసారి నా చేతుల్ని నాకసాగింది.

అప్పుడు గమనించాను. దాని చెవుల కింద ఏదో గజ్జి లాంటిదుంది. దాన్ని గజ్జంటారో అనరో నాకు తెలీదు గాని, మొత్తానికి మాత్రం అదేదో చర్మవ్యాధే!

కుక్క గజ్జి మనుషులక్కూడా అంటుకుంటుందా?

నేను కాస్త సందేహంగా దాన్ని దూరంగా నెట్టబోయాను. కానీ మనసొప్పలేదు.



ఎలా నెట్టగలను?

అది రాజుగారి కుక్క. సోమరాజుగారి కుక్క.

పోనీలెద్దూ...

కుక్క గజ్జే కదా...?

అంటుకుంటే అంటుకుందిలే...

మనసులోంచి అసహ్యం పొర్లుకొస్తున్నప్పటికీ అలా సర్దిచెప్పుకుని, దాన్ని రెండు చేతుల్తో పైకెత్తి నా ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాను. నా కూతురు స్వీటీని కూర్చోబెట్టుకున్నట్టు.

మా స్వీటీకి రెండేళ్ళు.

ఈ కుక్కకి ఎన్నేళ్ళో మరి?

నేను తనని ఒళ్ళో కూర్చోబెట్టుకున్నందుకు దానికి చాలా సంతోషంగా కలిగిందిలా ఉంది... ఆ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఈసారేకంగా నా మొహాన్నే నాకింది.

ఒళ్ళు జలదరించిపోయింది నాకు.

ఆ కుక్కముండని విసిరవతల పారేయాలన్పించింది.

అయినా తమాయించుకున్నాను...

అది రాజుగారి కుక్క కదా? సోమరాజుగారి కుక్క!!

దాని నోట్లోంచి ఏదో వెగటు వాసన...

డోకు రాబోయింది గానీ ఆపుకున్నాను... కక్కు ఆగదంటారు - కానీ నా విషయంలో ఆగింది మరి!

అది నా మొహంలో మొహం పెట్టి నా మూతిని నాకుతుంటే దాని చెవుల కింద గజ్జి మాత్రమే కాదు, చెవుల్లో పిడుదులు కూడా ఉన్నట్టు గమనించాను.

కుక్క పిడుదులు మనుషుల్ని కూడా పట్టుకుంటాయి.

పట్టుకుంటే ఒక పట్టాన వదలవు.

నా కిప్పటికీ గుర్తే. చిన్నప్పుడొకసారి నా చెవి (కుడిదో ఎడమదో సరిగ్గా గుర్తులేదు) ఎర్రగా ఇంత లావు వాచిపోతే మా నాన్న కంగారుపడి నన్ను ఇ.ఎన్.టి. స్పెషలిస్ట్ దగ్గరికి తీసుకెళ్ళాడు.

ఆయన నా చెవిని ధరోగా ఎగ్జామిన్ చేసి చివరికెలాగో కనిపెట్టాడు నా చెవిలో 'కుక్క పిడుదు' దూరిన సంగతి. చెవి పోర్షన్ వరకు మత్తింజక్షన్ ఇచ్చి ఫోర్‌సెప్స్‌తో దాన్ని బైటకి లాగేశాడాయన.

లాగి... నాకూ, మా నాన్నకీ కూడా చూపించాడా 'పిడుదు'ని... బొబ్బరగింజ అంత ఉందది!

'లక్కీగా ఫోర్‌సెప్స్‌కి అందింది కాబట్టి గానీ, లేకపోతే ఆపరేషన్ చెయ్యాల్సి వచ్చేదే' అన్నాడాయన.

'అలాగా?' అన్నాడు మా నాన్న భయంగా.

నా చెవిలోకి 'కుక్క పిడుదు' ఎలా దూరిందసలు?

పెట్‌డాగ్ అని కాదు గానీ, మా ఇంట్లో ఓ ఊర కుక్క తిరుగుతుండేది. అంటే ఊరంతా తిరిగినా దాని కేరాఫ్ అడ్రస్ మాత్రం మా ఇల్లన్నమాట! ఆ పిడుదు దాన్నుండే వచ్చుంటుందన్న ఉద్దేశంతో, నా చెవి అలాగయ్యింతర్వాత మా నాన్న దాన్ని కొట్టికొట్టి తరిమేశాడు.

అప్పట్నుంచి ఆ కుక్కనే కాదు మరే కుక్కనీ మా ఇంట్లో చేరనివ్వలేదు మా నాన్న.

అప్పట్నుంచి కుక్కలంటే నాకు భలే అసహ్యం.

విశ్వాసం అనే సుగుణం ఉంటే ఉండొచ్చు...

అయితే మాత్రం?

అది కరిస్తే రేబిస్ వస్తుంది గదా?

రేబిస్ వ్యాధి సోకిన వాళ్ళు ఎంత బాధపడతారో నాకు తెలుసు.

ఎంత ఘోరమైన నికృష్టమైన చావు చస్తారో నేను కళ్ళారా చూశాను.

ఎవరో కాదు, స్వయాన్నా మా మేనమామ కొడుకే మూడేళ్ళ క్రితం కుక్కకాటుకి గురై అలా ఘోరమైన చావు చచ్చిపోయాడు!

చచ్చిపోయే ముందు వాడు నీళ్ళని చూసి విపరీతంగా భయపడ్డం... అచ్చం కుక్కలాగే మొరగటం... ఏ కుక్కని చూసినా నాకు చటుక్కున కళ్ళల్లో మెదుల్తూంటుంది.

అందుకే కుక్క అనే దానికి వీలయినంత ఎడంగా ఉంటాను నేనెప్పుడూ.

అంత ఎలర్జీ నాకు కుక్కంటే.

నాకు ఎవరి మీదైనా కోపం ఎక్కువగా వస్తే 'కుక్క' అని తిట్టి సంతోషిస్తుంటాను. అంటే 'కుక్క' అనే పదమే నా దృష్టిలో ఓ తిట్టన్నమాట!

కుక్కంటే దరిద్రగొట్టు జంతువు ఈ ప్రపంచంలో ఉంటుందని నాకు అన్పించదెప్పుడూ.

అవును మరి... అంతెలర్జీ నాకు కుక్కంటే.

కానీ ఇప్పుడీ జాకీని ముద్దు చెయ్యక తప్పటంలేదు.

సోమరాజుగారి పియ్యే ద్వారా తెలిసింది – ఆయనకి జాకీ అంటే ప్రాణమని.

అందుకే నాకూ ఇప్పుడది ప్రాణప్రదమై పోయింది.

సోమరాజుగారు నేనే డిపార్ట్‌మెంట్‌లో పన్జేస్తున్నానో ఆ శాఖకే అమాత్యులు.

నా ప్రమోషన్ కోసం ప్రస్తుతం నాకు వారి రికమండేషన్ చాలా చాలా అవసరం.

వారు కటాక్షిస్తే చాలు నాకు ప్రమోషన్ రావడం గ్యారంటీ.

అందుకే వారం రోజుల్నుంచి ఈ ఇంటి చుట్టూ కుక్కలా తిరుగుతున్నాను.

మొదటి మూడ్రోజులూ శ్రీవారి దర్శనభాగ్యమే కలగలేదు.

నాలుగోనాడు దర్శనభాగ్యమైతే కలిగింది గానీ, వారితో మాట్లాడే అవకాశం రాలేదు.

అయిదో నాడు...

వారితో నేరుగా కాకపోయినా వారి పియ్యేతో విషయం చెప్పుకునే ఛాన్స్ దొరికింది.

ఆరోనాడు డైరెక్ట్‌గా శ్రీవారితోనే మాట్లాడే అవకాశం చిక్కింది.

జాకీని ఒళ్ళో కూర్చోబెట్టుకుని నేను చెప్పిందంతా శ్రద్ధగా విన్నారాయన. వింటున్నంతసేపూ జాకీని నిమురుతూనే ఉన్నారు.

అలా నా గోడు విని... 'సరే రేపు మళ్ళీ ఒకసారి కనబడు. తప్పకుండా చేద్దాంలే...' అని హామీ లాంటిదిచ్చారాయన.

నేడు ఏడో రోజు. అందుకే నేనిపుడొస్తి!

నేను జాకీతో మొహం నాకించుకుంటుండగా అటుగా వచ్చి నన్ను చూశారు సోమరాజుగారు.

'కాసేపుండు' అన్నట్టుగా సైగ చేసి ఆయన లోనికెళ్ళిపోగా, కుక్క – కాదు కాదు జాకీ – నా ఒళ్ళోంచి ఛెంగున దూకి ఆయన వెనుకే పరుగుతీసింది.



'అబ్బ! ఎంత అసహ్యంగా ఉందో బుజ్జిముండ' అనుకున్నాను. వారం నుండి వరుసగా వస్తున్నందువల్ల అది నాకు బాగానే మాలిమయ్యింది.

నేను మంత్రిగారి రూంలోంచి నా కోసం రాగల కబురు కోసం నిరీక్షిస్తూ కూర్చున్నాను.

నేనున్నది విజిటర్స్ రూంలో.

నాలాగే ఇంకో పది పన్నెండు మంది ఉన్నారక్కడ.

మంత్రిగారంటే మజాకానా?

ఎందరెందరికో ఎన్నెన్నో పన్లుంటాయ్ గదా వారితో?

నేను కునికిపాట్లు పడుతూ నా నిరీక్షణని అలా కొనసాగిస్తుండగా.... సడన్‌గా విజిటర్స్‌లో ఏదో కలకలం చెలరేగింది.

నేను గభాల్న కళ్ళు తెరిచి... అందరూ గుసగుసా ఏదో మాట్లాడుకుంటుంటే నా పక్కనున్న అతన్ని 'విషయమేమిట'ని అడిగాను.

'కొంప మునిగింది. మన మంత్రిగార్ని మంత్రివర్గం లోంచి తొలగించారట' అన్నాడతను.

మొదట నేను నమ్మలేకపోయాను.

కానీ అందరూ దాన్ని గురించే మాట్లాడుకుంటుంటే ఆ దుర్వార్త నిజమేనని అర్థమై పోయింది నాకు.

కారణం ఏమిటన్నది మాత్రం అర్థం కాలేదు.

రాజకీయాల గురించి నాకు తెలిసింది చాలా తక్కువ.

నేను నా పక్కనున్న అతన్తో ఏదో అనబోయాను.

అంతలో సోమరాజుగారు కంగారు కంగారుగా బయటికొచ్చి కార్లో ఎక్కి ఎక్కడికో వెళ్ళిపోయారు హడావుడిగా.

ఇంకా నేనెందుకిక్కడ – దండుగ?

'ప్చ్... ఎంత పనైంది?' అనుకుంటూ లేచి బైటికి నడిచాను.

నేను గేటు దాటి ఇవతలికొస్తుంటే జాకీ ఎక్కడ్నుంచో పరుగున వచ్చి నా కాళ్ళు నాకబోయింది.

డర్టీడాగ్!

నేను ఈడ్చిపెట్టి దాని డొక్కలో ఒక్క తన్ను తన్ని ముందుకు సాగిపోయాను.

★

---

*(21వ పేజీ తరువాయి)* కానీ మూడ్‌లో లేడతను. పురుషాయితమే ఆమెకి గత్యంతరమైంది. మధ్యలో చేతికైన గాయం గురించి అడిగితే... దిల్‌దారలీని చంపి చెరువులో పారేశానన్నాడతను.

★ ★ ★

'ఆదాబర్సే బహెనా... క్యాకహెనా... గుర్తున్నానా? ట్రాఫిక్ పోలీసునీ... భయపడిపోయాక. నీ భర్త కోసం నటించానంతే. నేను దిల్‌దారలీ అనే సీదాసాదా క్రూక్‌ని. నువ్వింకా తాహిర్‌ని నమ్ముతున్నావు కదూ? అయితే నా మాటలు విను... నా ఈ మాటలు నాకు ఇన్సూరెన్స్. అన్నట్టు నీకు ఇన్సూరెన్స్ గురించి తెల్సా? నాకు తెల్సు, తాహిర్ గాడికి తెల్సినట్టే. దేఖో అమ్మా... ఉదాహరణకి మనం ఎవరి మీదనైనా వాళ్ళకి తెలీకుండా పాలసీ తీసుకోవాలంటే కష్టం, అవునా? మెడికల్ చెకప్స్ వుంటాయి, సంతకాలు వుంటాయి – కదూ? ఎలాగో అది సాధించినా, ఆ వెంటనే ఆ పాలసీ హోల్డర్ చనిపోతే... అనుమానం వచ్చేస్తుంది ఇన్సూరెన్స్ వాళ్ళకి. కానీ తాహిర్‌గాడికో అయిడియా తట్టింది. వీడు మహా మాస్టర్ ఫ్రాడ్. వీడి భార్య నసీం కూడా. ఇద్దరూ చాలా హరామీ జంట. ఆ నసీం బతికే ఉంది. ఆమెకి విడాకులు కూడా ఇవ్వలేదు. ఆమె పేర అయిదు లక్షలకి పాలసీ తీసుకున్నాడు – ఎప్పుడో రెండేళ్ళ క్రితం. కనుక ఇప్పుడామె చనిపోతే ఇన్సూరెన్స్ వాళ్ళు పెద్దగా అనుమానించకపోవచ్చు. రెండేళ్ళంటే చాలా టైం కదా? అయితే ఈ నసీం ఇప్పుడప్పుడే చచ్చిపోవాలనుకోవడం లేదు–

'ఇక్కడే... ఇక్కడే నువ్వొచ్చావ్ సల్మా బహెన్... ఎందుకంటే నువ్వామె హంషకల్‌వి – రెండేళ్ళ క్రితం మెడికల్ చెకప్స్, సంతకాలూ వగైరా కానిచ్చి అయిదు లక్షలకి పాలసీ తీసుకున్న నసీంలాగే నువ్వున్నావు సల్మాజీ... అచ్చం నసీమే నువ్వు! ఇప్పుడు తాహిర్ భార్యగా ఎస్టాబ్లిషయ్యావ్. అచ్చుగుద్దినట్టుండే నీ శవాన్ని చూసి నసీం కాదనుకోలేరెవరూ. వీడికిద్దరు భార్యలుంటారని ఎవరనుకోబోతారు? అర్థమైందా? ఆమె చావుని నువ్వు చచ్చి చూపించబోతున్నావన్నమాట. తాహిర్‌గాడు ఇన్సూరెన్స్ డబ్బు కొట్టేస్తాడు. ఇక ఇద్దరూ కల్సి ఎక్కడికో చెక్కేస్తారు. పిక్చరు పడిందా, మేరీ ప్యారీ బహెనా? సెవెన్టీ ఎమ్మెమ్ పర్దా మీద కన్పిస్తోందా?

'ఇంకో ఫ్లాష్‌బ్యాక్ చూస్తావా... రెండేళ్ళుగా నీకు పెళ్ళెందుకు కాలేదనుకుంటున్నావు? సంబంధాలెందుకు తప్పిపోయేవీ? విను – రెండేళ్ళ క్రితం ఈ తాహిర్ గాడు నిన్ను చూసి వాడి బుర్రలో ఈ ప్లానుకి బీజం పడింది లగాయతూ, నిన్ను జారిపోకుండా చూశాడు. ఫోన్లు చేసి నీ మీద చెడ్డగా చెప్పడంవల్లే సంబంధాలు తప్పిపోయేవి...

'ఆల్రైట్ సల్మా సిస్టర్... నేను ఇరవై నాలుగ్గంటల్లో తిరిగి కన్పించకపోతే ఈ టేపు నీకు పంపించమని నా దోస్తు కిచ్చా. నీకు అందిందిగా? స్టోరీ తెలుసుకున్నావుగా? ఇక అల్లామాలిక్‌ని తల్చుకో.... నువ్వు కూడా పైకొస్తే అక్కడ కల్సుకుందామేం, ఖుదాహాఫీజ్!'

రిబ్బన్లు రిబ్బన్లుగా ఇంద్రధనుస్సు విడిపోయి, అక్టోపస్ టెంటకిల్స్‌లా నిలువెల్లా చుట్టేసి ఈడ్చుకెళ్ళి పోతున్నాయి అథఃపాతాళంలోకి... కెవ్వున అర్చింది.

'ఏమైంది?' పరిగెత్తుకొచ్చాడు తాహిర్.

సెట్‌లో టేపు ఆగిపోయి ఉంది. అది గమనించలేదతను. ఏమైందనడిగాడు పట్టుకుని–

వణికిపోతోంది సల్మా, 'రెండేళ్ళు... రెండేళ్ళుగా చుట్టపక్కాలు... స్నేహితులు... ఎందుకు దూరమయ్యారు... నేను చెడిపోయిన దాన్నని! కానీ నువ్వొచ్చావు. నీకు నా దగ్గరున్న డబ్బు సంగతి తెలీదు! నన్ను నన్నుగానే ప్రేమించావు – ఇంతకన్నా ఏం కావాలనుకున్నాను. నేనే నీ అమానత్ అయినప్పుడు... ఇక ఆ పదిలక్షలూ నీవి కావా...'

'ఏమిటి నువ్వనేది! నీ దగ్గర పదిలక్షలా...'

'అబ్బాజాన్ నాకిచ్చిపోయారు'

'అయితే – అయితే – ఆ నసీంని వదిలేస్తా!'

దఢాల్న తలుపు తోసుకుని వచ్చింది నసీం. అచ్చం తనలాగే వున్న ఆమెని చూసి అవాక్కయింది సల్మా.

'ఇలాగే చేస్తావని నాకు తెల్సు. తాహిర్' అంది నసీం పళ్ళ బిగువున, 'నా మనసు ముందునించే హెచ్చరిస్తోందిందుకే... ప్లానుని ఇప్పుడు నేను పూర్తి చేస్తాను, తప్పుకో'– తాహిర్‌ని తోసేసి, సల్మాని జుట్టు పట్టుకుని బరబరా లాక్కెళ్ళి నెట్టేయబోయింది బాల్కనీలోంచి – కళ్ళు తిరిగాయి... ఆ అరంతస్తుల పైనించీ భూఉపరితలాన్ని తాకే వరకూ ఆమె చేసిన ఆర్తనాదం పరిసరాల్లో ప్రతిధ్వనింపజేసింది...

చేతులు దులుపుకుని, సల్మావైపు తిరిగిన తాహిర్ 'మీరిందాక ఫోన్‌లో విన్పించిన టేపు ఏదీ, సల్మా సాహిబా?' అంటున్న ఇన్‌స్పెక్టర్‌ని చూసి... ★